క్లుప్తంగా

త్వరితగతిన కమాండ్ కంట్రోల్ పనులు



ఏసీ కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో చేపట్టిన కమాండ్ కంట్రోల్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. భవన పనులను అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, ఇంజినీరింగ్ విభాగాధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరంలో పారిశుధ్య పనుల పర్యవేక్షణ, నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల సమావేశాలు, తదితరాలను ఈ భవనంలో నిర్వహించనున్నామని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలతో నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యాలయంలోని అన్ని అంతస్తుల్లో సురక్షిత మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేసి, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చేపట్టాలని సూచించారు. మైపాడు గేట్ సమీపంలో జనావాసాల మధ్య నిర్వహిస్తున్న పశువుల కేంద్రాన్ని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కస్తూరిదేవి స్కూల్ ప్రాంగణంలో అక్రమంగా నిర్మిస్తున్న కల్యాణ మండపానికి నోటీసులను జారీ చేయాలని సూచించారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా

ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్లో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నియంత్రించి, పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించాలని కమిషనర్ పేర్కొన్నారు. ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్, రమేష్‌రెడ్డినగర్‌లోని గోశాల, కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరితో కలిసి ఆయన పరిశీలించారు. మార్కెట్ బయట రోడ్డు వెంబడి విక్రయాలు సాగించే వారు ఉదయం 7.30కు పరిసరాలను శుభ్రం చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఖాళీ చేయాలని సూచించారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

4న ఎస్పీ బాలు జయంతి

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను జూన్ నాలుగున నిర్వహించనున్నామని సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక సంస్థ కార్యదర్శి యజ్ఞావఝుల శేషగిరీశం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సినీ సంగీత విభావరిని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట మహాకుంభాభిషేక మహోత్సవాలను గురువారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నామని ఈఓ నవీన్‌కుమార్, కార్యక్రమ పర్యవేక్షకుడు వంగాల శ్రీనివాసులురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవచనం, అఖండదీపారాధన, అంకురార్పణ, తదితర పూజా కార్యక్రమాలను గురువారం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. భక్తులు విశేషంగా తరలిరావాలని కోరారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నెల్లూరు (టౌన్): భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేకావసరాలు గల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐఈ కోఆర్డినేటర్ ధనమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 38 భవిత కేంద్రాల్లో ఆరు నుంచి 16 ఏళ్లలోపు గల విభిన్న ప్రతిభావంతులకు ఫిజియోథెరపిస్ట్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 2022 – 23 విద్యాసంవత్సరానికి గానూ అలవెన్స్ కింద జిల్లా వ్యాప్తంగా రూ.7.53 లక్షల విలువైన సీపీ, వీల్ చైర్లు, ట్రై సైకిళ్లను అందజేశామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 2800 మందికి సీడబ్ల్యూఎస్సెన్ ద్వారా స్టయిఫండ్, ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్, హెచ్‌బీఈ అలెవెన్స్‌ల కింద వారి తల్లిదండ్రుల ఖాతాల్లో రూ.53.13 లక్షలను జమ చేశామని వెల్లడించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సీడబ్ల్యూఎస్సెన్ వివరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. వివరాలకు 86396 76371 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

5న అక్షరాభ్యాసం

నెల్లూరు(బృందావనం): శెట్టిగుంటరోడ్డులోని వీవర్స్ కాలనీలో గల పట్టాభిరామస్వామి దేవస్థానంలో అక్షరాభ్యాస మహోత్సవాన్ని జూన్ ఐదో తేదీన నిర్వహించనున్నామని దేవస్థాన కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని కవి ఆలూరు శిరోమణిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను దేవస్థానంలో నమోదు చేసుకోవాలని కోరారు.

పొగాకుతో ప్రాణాంతక వ్యాధులు

- వీఎస్‌యూ వీసీ సుందరవల్లి
- పొగాకుకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు



వెంకటాచలం : పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న వీఎస్‌యూ వీసీ సుందరవల్లి

వెంకటాచలం : ఏ రూపంలో పొగాకును తీసుకున్నా ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, వాటికి దూరంగా ఉండాలని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి హెచ్చరించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వెంకటాచలం మండలం కాకుటూరులోని వీఎస్‌యూలో బుధవారం వీసీ సుందరవల్లి అందరితో పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు తీసుకోవడం వల్ల శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఊపిరితిత్తులకు ముప్పు వాటిల్లి ప్రాణాంతకమైన వ్యాధులు సోకుతాయని తెలియజేశారు. మెదడులో రక్తప్రసరణ అంతరాయం ఏర్పడటంతో పాటు గొంతు కేన్సర్, గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పొగాకు వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థి దశ నుంచే పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ జీ.విజయానంద్ కుమార్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ కె.సునీత, ప్రొఫెసర్లు సుజా ఎస్ నాయర్, సాయిప్రసాద్‌రెడ్డి, హనుమారెడ్డి, శ్రీకన్యారావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

పొదలకూరు : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీని మండలంలోని మహ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో డాక్టర్ వి.నరసింహారావు పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గ్రామస్తులతో కలిసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వి.శ్రీకావ్య, పర్యవేక్షకుడు కె.శ్రీనివాసులు, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పొగాకుకు దూరంగా ఉండాలి

కొడవలూరు : పొగాకు ఉత్పత్తులకు విద్యార్థులు దూరంగా ఉండి ఆరోగ్యాలను కాపాడుకోవాలని వైద్యాధికారిని గీతా సాహితి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పొగాకు ఉత్పత్తుల వాడడం వల్ల కేన్సర్, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో నీతి కథలు చెప్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సుభాషిణి, లైబ్రేరియన్ కె.రాజేశ్వరి పాల్గొన్నారు.



పొదలకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, గ్రామస్తులు



కొడవలూరు : మాట్లాడుతున్న వైద్యాధికారి

పేదల కాలనీల్లో దేవాలయాల నిర్మాణం



విగ్రహాలకు పాలాభిషేకం చేస్తున్న మంత్రి కాకాణి దంపతులు

- ప్రత్యేక కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి

పొదలకూరు : రాష్ట్రంలో పేదలు నివసించే కాలనీల్లో వారి మనోభావాలకు అనుగుణంగా దేవాలయాలను నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మరుపూరు గ్రామంలో కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో విగ్రహప్రతిష్ట మహోత్సవాల్లో బుధవారం మంత్రి కాకాణి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇక్కడి దేవస్థానం నాలుగు శతాబ్దాల క్రితం నిర్మించినట్లు తెలిపారు. దాతలు, గ్రామపెద్దలు కలిసి తిరిగి దేవస్థానాన్ని ఎంతో చక్కగా పునర్నిర్మించినట్లు పేర్కొన్నారు. ఎంతో చరిత్ర ఉన్న దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠకు తనను ఆహ్వానించినందుకు పాలకమండలికి ధన్యవాదాలు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో టీటీడీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు పలు కాలనీల్లో 28 దేవస్థానాలను నిర్మించామన్నారు. ఇందుకోసం ఒక్కొక్క ఆలయానికి టీటీడీ రూ.10 లక్షలు అందజేసినట్లు తెలిపారు. మరో 18 దేవాలయాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలో వాటిని నిర్మిస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భక్తుల మనోభావాలను గౌరవిస్తూ టీటీడీ సహాయ, సహకారాలతో ఆలయాలను నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. మంత్రి వెంట సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వళ్లూరు గోపాల్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ సుబ్బరాయుడు, నేతలు వేణుంబాక సుమంత్‌రెడ్డి, వళ్లూరు విజయ్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులురెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్



సిబ్బందికి నగదు రివార్డు అందచేస్తున్న రూరల్ డీఎస్పీ

కోవూరు: కోవూరు సాలుచింతలు వద్ద ఇటుక బట్టీల వద్ద కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే నజీమా (49) హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి కోవూరు సీఐ కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కోవూరు సాలుచింతలు సమీపంలో నివాసముంటున్న నజీమా ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ తెల్లవారుజామున సహచర కూలీలతో కలిసి పని చేసుకుంటోంది. అదే సమయంలో నెల్లూరు నవాబుపేటలో నివాసముంటున్న తాతా హరికిశోర్ నజీమా వద్దకు వచ్చి తాను పోలీసు అని, ఇక్కడ ఏమి చేస్తున్నావు అని ప్రశ్నించాడు. స్టేషన్‌కు రావాలని మందలించాడు. దీంతో అతను నిజంగానే పోలీసు అని భయపడిన నజీమా హరికిశోర్ బైక్ ఎక్కింది. దీంతో అతను కోవూరు బజారు మీదుగా తీసుకెళ్లి సాయిబాబా గుడి వద్ద బైక్‌ను నిలిపాడు. ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. అందుకు నజీమా ప్రతిఘటించడంతో తలను రోడ్డుకేసి బలంగా కొట్టి అత్యాచారం చేశారు. ఈ క్రమంలో ఆమె మరణించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఐ రామకృష్ణారెడ్డి నేతృత్వంలో ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు, సిబ్బంది కలిసి ఘటనా స్థలంతో పాటు పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. చుట్టుపక్కల వారిని విచారించి నిందితుడు హరికిశోర్‌ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐతో పాటు ఎస్సై, సిబ్బందిని డీఎస్పీ వీరాంజనేయరెడ్డి ప్రత్యేకంగా అభినందించి వారికి రివార్డులు అందజేశారు. సమావేశంలో ఎస్సై రమ్య, సిబ్బంది ఉన్నారు.

వసతిగృహాల్లో దోమల మందు పిచికారీ



పొదలకూరు : కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల పునఃప్రారంభానికి ముందు పట్టణంలోని వసతిగృహాల్లో బుధవారం దోమల నియంత్రణకు మలాథీయం మందును పిచికారీ చేశారు. చికెన్‌గున్యా, మలేరియా వంటి జ్వరాల బారిన పడకుండా ముందస్తుగా పిచికారీ చేస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ఎం.రమేష్ వెల్లడించారు. కార్యక్రమంలో మలేరియా అధికారి ఆంజనేయవర్మ, విస్తరణాధికారి రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అసోసియేట్ డీన్‌గా బాలసుబ్రమణియన్

- డాక్టర్ రామలింగయ్య పదవీ విరమణ



రామలింగయ్య దంపతులను సత్కరిస్తున్న ప్రొఫెసర్లు

ముత్తుకూరు : ముత్తుకూరులోని మత్స్యకళాశాల నూతన అసోసియేట్ డీన్‌గా డాక్టర్ ఎ.బాలసుబ్రమణియన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు 2021 అక్టోబరు 14 నుంచి కళాశాల అసోసియేట్ డీన్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ రామలింగయ్య ఉద్యోగ విరమణ చేశారు. మత్స్యకళాశాలలో 30 ఏళ్ల పాటు అనేక బాధ్యతలు నిర్వర్తించి, విశేషమైన సేవలు అందించినందుకు రామలింగయ్యను, ఆయన సతీమణిని ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఫిషరీస్ డీన్ డాక్టర్ డీఆర్‌కే రెడ్డి, ప్రొఫెసర్లు ధనపాల్ తదితరులు రామలింగయ్య సేవలను గుర్తు చేసుకున్నారు. నూతన అసోసియేట్ డీన్ బాలసుబ్రమణియన్‌కు ఘన స్వాగతం పలికారు.

నానో డీఏపీని వినియోగించాలి

- జిల్లా వనరుల కేంద్రం డీడీఏ



పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ముత్తుకూరు : రైతులు నానో డీఏపీ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ డిప్యూటీ డైరెక్టర్ శివనారాయణ చెప్పారు. ముత్తుకూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ సహాయకుల శిక్షణ సమావేశంలో ఆయన ప్రసంగించారు. అనంతరం పంటపాళెం, బలిజపాళెం గ్రామాల్లో వేరుశనగ పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం పంటలను బెట్ట పరిస్థితి నుంచి గట్టెక్కించాలంటే నానో డీఏపీ వినియోగం చాలా అవసరమన్నారు. అనంతరం ఎలా వినియోగించాలో చేసి చూపించారు. అలాగే, కలుపు మందుల వినియోగంపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో కర్ణాటక ఎమ్మెల్సీ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ ప్రకాశ్ రాథోడ్

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని బుధవారం కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాశ్ రాథోడ్ దర్శించుకున్నారు. తొలుత గణపతి స్వామి, సుబ్రహ్మణ్యంస్వామి, మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్సీని స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వెంకటాచలం : అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన వెంకటాచలం మండలం కాకుటూరు పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో బుధవారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. అడవిలోని శివాలయానికి కిలోమీటరు దూరంలో కానగ చెట్టు వద్ద దుర్వాసన వస్తుండటంతో పశువుల కాపరులు వెళ్లి చూడగా, గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే వెంకటాచలం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ గంగాధర్‌రావు, ఎస్సై అయ్యప్ప తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం బాగా కుళ్లిపోయి, గుర్తుపట్టలేని విధంగా మారిపోయింది. మృతుడు ఆత్మహత్య చేసుకున్నాడా, లేక ఎవరైనా కొట్టి చంపారా, అనారోగ్యంతో మృతి చెందాడా అనే విషయాలు తెలియలేదు. మృతుని శరీర భాగాలు కుళ్లిపోయిన విధానాన్ని బట్టి చనిపోయి 20 రోజులు గడిచి ఉంటుందని, వయస్సు 35 ఏళ్లు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని మూడో వార్డులో సీసీరోడ్డు నిర్మాణానికి కౌన్సిలర్ డాక్టర్ అందె ప్రత్యూష బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఇక్కడ 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించిన సమయంలో స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారని, స్పందించిన ఆయన రూ.5 లక్షలను మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. అనంతరం కౌన్సిలర్ దంపతులను స్థానికులు సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నేతలు రమేష్, రజనీకాంత్, సురేష్ పాల్గొన్నారు.

వివరాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న సీడీపీఓ హేనాసుజన్

ఇందుకూరుపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల బరువు, ఎత్తు తదితర వివరాలను నమోదు చేయాలని సీడీపీఓ హేనాసుజన్ సూచించారు. మండలంలోని పల్లిపాడులో సెక్టర్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 10వ తేదీలోగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రోత్ చార్టులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శిరీష, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా ఉపాధి అధికారి బదిలీ

నెల్లూరు(మినీబైపాస్): జిల్లా ఉపాధి అధికారి ఏ సురేష్ కుమార్‌ను కడపకు బదిలీ చేస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం బుధవారం జారీ చేసింది. దీంతో ఆయన విధుల నుంచి రిలీవయ్యారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రవికుమార్

పొదలకూరు : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అలాంటి వాటిని ప్రోత్సహించే వారి వివరాలు అందజేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈబీ జిల్లా సూపరింటెండెంట్ రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక సెబ్ కార్యాలయంలో బుధవారం జరిగిన మోటార్‌బైక్ వేలంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. వేసవి సెలవులు పూర్తయిన తర్వాత కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగం, వాటి వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. మోటారు బైక్‌కు ప్రభుత్వ వేలం ధర రూ.4 వేలు నిర్ణయించగా పాటలో రూ.6,660 వచ్చిందన్నారు. అనంతరం పట్టుబడిన మద్యం, సారా తయారీకి ఉపయోగించే బెల్లంను సెబ్ అధికారులు, సిబ్బంది ధ్వంసం చేసి మురుగు కాలువలో పడవేశారు.కార్యక్రమంలో సెబ్ సీఐ వెంకటరావు, ఎస్సై శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

మనుబోలు : ప్రజా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని చెర్లోపల్లి సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని, అర్జీల రూపంలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. యూనిఫాం తప్పక ధరించాలని, సమయపాలన తప్పనిసరి అని పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ శివప్రసాద్ ఉన్నారు.

వీరభద్రస్వామి దేవస్థానంలో వార్షిక వేడుక



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మనుబోలు : మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో వార్షికోత్సవాల్లో భాగంగా చివరిరోజు బుధవారం విశేష పూజలు, హోమాలు జరిపారు. ఇందులో భాగంగా మహాశాంతి హోమం, వీరభద్ర మూలమంత్ర హోమం, రుద్ర హోమం, మహా చండి హోమం, లఘుపూర్ణాహుతి, మహాకుంభాభిషేకం తదితర పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కార్యక్రమాల్లో భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు



విజేతకు బహుమతి అందిస్తున్న డీఏఏబీ చైర్మన్

కోవూరు: కోవూరులోని శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్లో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ పోటీలు బుధవారం ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం చదువులోనే కాకుండా క్రీడల పట్ల మక్కువ చూపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మల్లవరపు చిరంజీవి, సచివాలయ మండల కన్వీనర్ కవరగిరి ప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు కేతా మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

చాముండేశ్వరికి అశ్వ వాహనసేవ

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన చాముండేశ్వరీదేవి అమ్మవారికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అశ్వవాహన సేవ అత్యంత వైభవంగా జరిగింది. తొలుత అమ్మవారిని వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. గ్రామ వీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కొబ్బరికాయ, కర్పూర హారతులు సమర్పించి దర్శించుకున్నారు. కార్యక్రమానికి ఉభయదాతలుగా వైశ్యులు వ్యవహరించారు. ఉదయం జరిగిన అమ్మవారి చప్పర ఉత్సవానికి మూలగల ప్రదీప్– మాధవి, పూల్లా విశ్వేశ్వర రెడ్డి– మంజుల దంపతులు వ్యవహరించారు. అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్ స్వామి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

శేషజీవితం హాయిగా సాగాలి



నెల్లూరు(క్రైమ్): ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో శేషజీవితాన్ని గడపాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి కాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులు సుగుణమ్మ, కామేశ్వరిని జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఏఎస్పీ హిమవతి, ఎస్పీ ఘనంగా సత్కరించారు. ఏఓ విజయ్‌కుమార్, హోంగార్డ్స్ డీఎస్పీ చంద్రమోహన్, ఆర్‌ఐ పాల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.